క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గండేడ్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని.. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఉమ్మడి మండల ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా అన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట్‌లో కళాకారుల ప్రదర్శన

మహమ్మదాబాద్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు ప్రజలకు వివరించారు. బుధవారం మంగంపేట్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రదర్శనలు చేపట్టి అవగాహన కల్పించారు. కార్యదర్శి మంజుల, దశరథ్‌గౌడ్, నర్సిములు, సత్యయ్య, కళాకారులు ఉదయ్‌కుమార్, ప్రకాశ్, విజయ్‌కాంత్, అశోక్, సంతోష్. పద్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి



జడ్చర్ల టౌన్: ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ 'ఏ'లో చేర్చాలని నాయకులు అన్నారు. హైదరాబాద్ కంచన్‌బాగ్‌కు చెందిన ముదిరాజ్ నాయకుడు పృథ్వీరాజ్ సమకూర్చిన ద్విచక్రవాహన, సెల్‌ఫోన్‌బ్యాక్ కవర్ స్టిక్కర్లను బుధవారం కావేరమ్మపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రమౌళి, గిరమోని రవీందర్, కావలి శ్రీధర్, గోనెల నరేందర్, గుండు శ్రీశైలం తదితరులు ముదిరాజ్‌ల ఐక్యతను చాటుదామని పిలుపునిచ్చారు. స్టిక్కర్‌ను వాహనానికి, సెల్‌ఫోన్‌కు వేసుకుని సగర్వంగా ముదిరాజ్‌ను అని చాటాలన్నారు.

'కేంద్ర' పథకాలను వినియోగించుకోవాలి



హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల నాయకుడు రఘురాం గౌడ్ కోరారు. బుధవారం పెద్దర్పల్లిలో మహిళా సంఘాల వారికి వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక ఎంపీ సూచనల మేరకు ప్రధానంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ, ఆయుష్మాన్ భారత్ పథకాలపై ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోజు కూలి రూ.800 ఇవ్వాలి



జడ్చర్ల టౌన్: పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయకూలీలకు రోజు కూలి రూ.800 ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం మల్లెబోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కూలీల సదస్సులో పాల్గొని ప్రసంగించారు. కొన్నేళ్ల నుంచి వ్యవసాయకూలీలను రూ.300 కే పరిమితం చేశారని, వరినాట్లు అయితే ఎకరానికి రూ.3వేల నుంచి రూ. 4వేల వరకు ఇస్తున్నారని అన్నారు. లేబర్ అధికారులు ప్రతి రెండేళ్లకోమారు కూలి సవరణ చేయాలన్నారు. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతుల జీవన పరిస్థితులపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు యాదయ్య, నాయకులు నర్సింహ, పోశయ్య, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడి సతీమణి మృతి



అడివమ్మ (ఫైల్)

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు కొత్త రాములు సతీమణి అడివమ్మ (93) బుధవారం కన్నుమూశారు. బాదేపల్లి పాతబజార్‌లో నివాసం ఉంటున్న ఆమె ఇంట్లోనే అస్వస్థతకు గురయ్యారు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని వివరించారు.

రేపటి తరాల భవిష్యత్ కోసం..



నసురుల్లాబాద్ గ్రామంలో మొక్కలు నాటిన అడిషనల్ డీఆర్‌డీఓ మషాయిదాబేగం (ఫైల్)

● జోరుగా వనమహోత్సవం

జడ్చర్ల టౌన్: రేపటి తరాల భవిష్యత్ కోసం మంచి ప్రకృతిని, వాతావరణాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు పర్యావరణ చర్యలపై దృష్టి పెడుతున్నాయి. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం చేపట్టింది. ఈ కార్యక్రమం మండలంలో జోరుగా కొనసాగుతోంది. ఈ మేరకు 45 గ్రామ పంచాయతీల్లో 3.86 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో 65 వేల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. మిగిలిన వాటిని ప్రభుత్వ ఖాళీ స్థలాలు గుర్తించి అందులో ఎక్కువగా నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే బూర్గుపల్లి గ్రామంలో అత్యధికంగా 20వేల మొక్కలు, ఆ తరువాత పోలేపల్లి, గంగాపురం, ఈర్లపల్లి, ఆలూరు, కోడ్గల్, మల్లెబోయిన్‌పల్లి గ్రామాల్లో 15వేల చొప్పున మొక్కలు నాటుతున్నారు. నసురుల్లాబాద్‌లో 12వేలు, ఆల్వాన్‌పల్లి, చర్లపల్లి, గొల్లపల్లి, కిష్టారం, కొండేడ్, లింగంపేట, నెక్కొండ, పెద్ద ఆదిరాల గ్రామాల్లో 10వేల చొప్పున మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. బండమీదిపల్లి, చిన్న ఆదిరాల, చిట్టెబోయిన్‌పల్లి, దేవునిగుట్టతండా, గోప్లాపూర్, ఖానాపూర్, కిష్టంపల్లి, కొళ్లొనిమర్లతండా, మాటుబండతండాల్లో 8 వేల చొప్పున మొక్కలు నాటే చర్యలు ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్రామాల్లో కనీసం 5వేలకు తగ్గకుండా మొక్కలు నాటేలా లక్ష్యం నిర్దేశించారు. ఇటీవల వర్షాలు పడుతుండటంతో వనమహోత్సవం ఊపందుకుంది. 45 గ్రామపంచాయతీల్లో ఇప్పటివరకే 1.30 లక్షల మొక్కలు నాటినట్లు అధికారులు చెబుతున్నారు.

లక్ష్యం చేరుకునేందుకు చర్యలు

మండలంలోని 45 గ్రామపంచాయతీల్లో 3.86 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. ఆ లక్ష్యం చేరుకునేందుకు ఖాళీస్థలాలు, గుట్టలు, చెరువుకట్టలు ఉన్న గ్రామాలను గుర్తించి లక్ష్యం ఎక్కువగా ఇచ్చాం. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆల్వాన్‌పల్లి చెరువు కట్టపై 1100ఈత మొక్కలు నాటించాం. వర్షాలు పడుతుండటంతో గత నెలలో నాటిన మొక్కలు అన్ని పెరుగుతున్నాయి.

–వెంకట్‌ప్రసాద్, ఎంపీడీఓ, జడ్చర్ల

కమ్యూనిటీ ప్లాంటింగ్ అధికం

వనమహోత్సవంలో ఈ ఏడాది కమ్యూనిటీ ప్లాంటింగ్‌పై ఎక్కువ దృష్టిసారించారు. ఇందులో చెరువుకట్టల వెంట, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, గుట్టలు, తదితర స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. తద్వారా సంరక్షణ సులువవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఆల్వాన్‌పల్లి చెరువుకట్టపై 11వందల ఈత మొక్కలు

ఆల్వాన్‌పల్లి గ్రామం చెరువు కట్టపై ఏకంగా 11వందల ఈత మొక్కలు నాటారు. కట్టరోడ్డుకు ఇరువైపులా వాటిని నాటించారు. అదేవిధంగా కట్ట కింద ఉన్న రోడ్డుకు ఇరువైపులా కానుగ, ఇతర మొక్కలు నాటారు. వర్షాలు పడుతుండటంతో వనమహోత్సవం సత్ఫలితాలను ఇవ్వనుందని అధికారులు చెబుతున్నారు.



ఆల్వాన్‌పల్లి చెరువుకట్టకింద రోడ్డుపక్కన నాటిన కానుగ మొక్కలు



ఆల్వాన్‌పల్లిలో బుధవారం మొక్కలు నాటి నీళ్లుపోస్తున్న ఎంపీడీఓ వెంకట్ ప్రసాద్



నసురుల్లాబాద్ రోడ్డుపక్కన పెరుగుతున్న మొక్కలు

ఆరోగ్య ఉపకేంద్ర భవనం పూర్తయ్యేనా?



రంగారెడ్డిగూడలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్ర భవనం

రాజాపూర్: రంగారెడ్డిగూడ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో రూ. 20 లక్షల నిధులు మంజూరుకావడంతో శివారులో ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మించారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ కరెంట్, ప్లంబర్, టైల్స్ పనులను పూర్తి చేయలేదు. దీంతో ఇప్పటికి రంగారెడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఓ తరగతి గదిలోనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని నడిపిస్తున్నారు. దీంతో ఇక్కడికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పూర్తిచేయించాలని కోరుతున్నారు. కాగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పనులను పూర్తి చేయించేందు కు ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 5 లక్షల మంజూరుకోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

భూత్పూర్ ఎస్‌ఐగా చంద్రశేఖర్

భూత్పూర్: మండల నూతన ఎస్‌ఐగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్‌కు ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. కాగా ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ శ్రీనివాసులు ఊట్కూర్‌కు బదిలీ అయ్యారు.

హెల్త్ అసిస్టెంట్‌కు అవార్డు

నవాబుపేట: కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో చురుకైన పాత్ర పోషించిన నవాబుపేట పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ శరభలింగంనకు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. బుధవారం జిల్లా వైద్యాధికారుల బృందం ఈ అవార్డును ప్రకటించింది. మండల వైద్యాధికారి నరేష్‌చంద్ర, సిబ్బంది రాఘవేందర్, అవినాష్ తదితరులు ఆయనను అభినందించారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

రాజాపూర్: మండల కేంద్రానికి చెందిన పల్లె ఆంజనేయులు కంటిచూపు మందగించడంతో ఆస్పత్రికి చూయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో తనతో పాటు (1994–95 బ్యాచ్) కలిసి చదువుకున్న స్నేహితులు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. శ్యాంసుందర్‌రెడ్డి, వనపర్తి శ్రీనివాసులు, అన్మగళ్ల నర్సిములు తదితరులు కలిసి రూ. 10వేల నగదు అందజేశారు.

బాదేపల్లి పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్‌కు తీర్మానం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పీఏసీఎస్ సీఈఓ యాదగిరిని విధుల నుంచి తప్పించేందుకు పాలకవర్గం తీర్మానం చేసినట్లు చైర్మన్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎరువుల అమ్మకాలకు సంబంధించి దినసరి కూలి అయిన రాఘవేందర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ పాలకవర్గం తీర్మానం చేసినట్లుగా తప్పుడు ప్రతిని డీసీఓకు యాదగిరి అందజేశారని అన్నారు. విషయంపై క్రిమినల్ చర్యలకు వెళ్తున్నామన్నారు. రూ.4లక్షల అవినీతికి పాల్పడ్డారని, చెల్లించాలని సర్‌చార్జ్ ఆర్డర్ ఇచ్చినా స్పందించలేదన్నారు. నాగసాల వద్ద నిర్మించిన గోడౌన్ విషయంలో నిధుల డ్రాకు సంబంధించిన రికార్డులను బహిర్గత పర్చారని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓ పార్టీకి ప్రచారం చేశారని గంగాపురంకు చెందిన రాజశేఖర్‌రెడ్డి అనే రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్‌చార్జ్ ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. పై వాటికి స్పందించనందున విధుల నుంచి తాత్కాలింగా తొలగించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

మత్స్యరంగంలో గణనీయమైన పురోగతి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్నేళ్లుగా శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంతో మత్స్యరంగం గణనీయమైన పురోగతి సాధించిందని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. విజయ్‌కుమార్ అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఈ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. జంతుశాస్త్ర విభాగ అధిపతి జి.స్వాతి, అకాడమీ కో–ఆర్డినేటర్ ఆర్.లావణ్య, అధ్యాపకులు డా.బి.మధుసూదన్, డా.సీహెచ్. శివప్రసాద్, ఎం.వెంకటరమణమూర్తి, ఆసియాబేగం, నాగలింగం, డా.బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులకు చేయూత ఇవ్వాలి



మరికల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్మికులకు చేయూత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా మండలంలోని బుధవారం గజ్జలమ్మ ఆలయం వద్ద వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు దిన, దిన గండంగా కాలం వెళ్లదిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకునేందుకు అర్హులైన వారికి పింఛన్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్, రామకృష్ణ, మొగులప్ప, కొండయ్య, రాజు, రమేష్, సాయితేజ, ఆంజనేయులు, నర్సింహులు, కుర్మన్న పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ వద్ద స్టాప్ ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులకు సంబంధించి జడ్చర్ల పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద స్టాప్ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వికలాంగుల సంస్థ చైర్మన్‌కు సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర వికలాంగుల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన ముత్తినేని వీరయ్యను జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ వికలాంగుల విభాగం అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్, కార్యదర్శి వీరేశ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, పాండునాయక్, బుడ్డనప్ప, కొండా శ్రీనివాస్, హన్మంతునాయక్, హర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లయ్య నాయక్‌కు..

మహమ్మదాబాద్: తెలంగాణ గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లయ్యనాయక్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మండల గిరిజన నాయకులు బుధవారం ఆయనను కలిసి సన్మానించారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి, ఎస్టీసెల్ తాలుకా అధ్యక్షుడు మోహన్‌నాయక్, టీక్యా, ప్రతాప్, అంజ్యానాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

మరికల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి అన్నారు. మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. 275మంది విద్యార్థులు ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో కనీస మౌళిక సదుపాయల లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైనా టాయిలెట్స్, తాగునీరు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. నాణ్యత లేని భోజనం పెట్టడంతో ఇళ్ల వద్ద నుంచి టిఫిన్లు తెచ్చుకొని భోజనం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అధికారులు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



అనువైన స్థలంలో నిర్మాణాలు చేపట్టాలి



మాట్లాడుతున్న సిరాజ్‌ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలో ఒక ఎకరా స్థలంలో రూ.25కోట్లతో షాదీఖానా నిర్మాణం, రూ.15 కోట్లతో ఉర్దూఘర్ నిర్మాణం, మౌలాలిగుట్ట వద్ద ముస్లిం స్మశానవాటిక కోసం ఐదు ఎకరాలు కేటాయింపు, కంపౌండ్, ఇతర పనుల కోసం రూ.5కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో రూ.45కోట్లతో అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలో ముస్లింలకు అనువైన స్థలంలో ఉర్దూఘర్, షాదీఖాన నిర్మాణాలు చేపట్టాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్ కోరారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తంచేశారు. జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇష్రత్‌అలీ, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అయూబ్, సలహాదారు యూసుఫ్ బిన్ నాసర్, ముస్లిం జేఏసీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఖయ్యూం ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనసన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం చంద్రకాంత్ తదితరులు

గండేడ్: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు రుసుంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రకాంత్, తదితరులు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లినా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అదేవిధంగా కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సైతం సన్మానించి స్వాగతం పలికారు. కొత్తగా వచ్చిన వారిలో అంజమ్మ, మమత, సరస్వతి, శ్యామల, గోపాల్‌లు ఉండగా బదిలీపై వెళ్లిన వారిలో శ్రీకాంత్, గోపాల్, లాలయ్య, నరసింహారెడ్డి, కుర్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిరీష, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి

నారాయణపేట: అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ పార్క్ ఎదురుగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న ధర్నా ఐదోరోజు కొనసాగింది. ఈ మేరకు.. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండెగారి దస్తప్ప, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు మల్లేష్ రిలేదీక్షలు చేపట్టిన ఎపద్మమ్మ, దొడ్డ పద్మమ్మ, నర్సింగమ్మ, మౌలానా, తిప్పమ్మ, లక్ష్మమ్మ, పూల దండ వేసి దీక్షలను ప్రారంభించారు.

కొత్త మొల్గర పాఠశాలలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

భూత్పూర్: 'విద్యార్థులతో మరమ్మతు పనులు' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు భూత్పూర్ ఎంఈఓ నాగయ్య కొత్తమొల్గర పాఠశాలలో విషయంపై విచారణ చేపట్టారు. హెచ్‌ఎం రంగయ్యను సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాక్షితో మాట్లాడారు. పాఠశాలకు వెళ్లి విచారణ చేశామని డీఈవోకు నివేదిక అందజేయనున్నట్లు వివరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మిడ్జిల్‌లో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు



దేవరకద్రలో..

మిడ్జిల్/భూత్పూర్/జడ్చర్ల/దేవరకద్ర: కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆయా మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద సీఐటీయూ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు.

■ భూత్పూర్‌లో బుధవారం ఎంపీఓ శ్రీదేవికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వి. కురుమూర్తి మాట్లాడారు. 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణ. వెంకటేష్, రాఘవేందర్, నర్సమ్మ, నర్సింహులు తదితరులు ఉన్నారు.

■ మిడ్జిల్ మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రంను తహసీల్దార్ రాజునాయక్‌కు అందజేశారు. మహిమూదాబేగం, లీలావతి, అచ్చలయ్య, జంగయ్య పాల్గొన్నారు.

■ జడ్చర్లలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తదితరులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సత్యానారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు వెంకటేష్, కృష్ణయ్య, మున్నా, సరోజ, రాజ్యలక్ష్మి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో ఆశావర్కర్ల ధర్నా..

ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా హామీలను నేరవేర్చడంలో విఫలం అవుతోందని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలసరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలలు దాటినా హామీల అమలు లేదు

రాజాపూర్(బాలానగర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు దాటినా హామీలు అమలు కావడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ ఆరోపించారు. బుధవారం బాలానగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.